# త్యాగం

శ్రీ కొల్లిపర సౌభాగ్యరావు

నా భర్తకు ఒక సంవత్సరం కారాగార శిక్ష విధించారు. అది జ్యేష్ఠమాసం. ఎండ తీక్షణంగా వుంది. వడగాలి తీవ్రంగా వీస్తూవుంది. మిట్టమధ్యాహ్నమప్పుడు మండుటెండలో దేశసేవకులు మా ఇంటికివచ్చారు. వారిని నాభర్త ఫలహారములతో సత్కరించారు. కేవలం యిదే వారుచేసిన అపరాధం.

నా భర్తకు శిక్ష చెప్పినరోజు నేను కోర్టుకు వెళ్లాను. అక్కడ ఒకప్రక్క ఒదిగినుంచుని చూస్తున్నాను. కోర్టుబయట నగరంలోని జనమంతా గుమిగూడారు. వాళ్లల్లోని రాజకీయ చైతన్యం బోనులో బంధించిన సింహంలా గాండ్రుపెడుతోంది.

నా భర్తను చేతులకు సంకెళ్లు తగిలించి వెంటబెట్టుకొచ్చారు పోలీసులు. కోర్టులోను, కోర్టుబయట సూదిపడిన శబ్దం వినవచ్చేటంతటి నిశ్శబ్దత వ్యాపించింది. నాలో ఒక విధమయిన ఆందోళన బయలుదేరింది, నాంలో ప్రాణాలు మైనం ముద్దవలె కరిగిపోతవేమోననిపించింది. ఉత్సాహావేశాల తరంగాలు బయలుదేరి శరీరాన్నంతా వణికించి వేస్తున్నై. ఈ విధమయిన గర్వం నాకెన్నడూ కల్గలేదు.

ఆకోర్టు, కుర్చీలో కూర్చొన్న అధికారి, ఎర్రటి జరీఅంచుల తలపాగాలు ధరించిన పోలీసులు, అందరూ నాకండ్లకు అత్యంత నీచులుగా కన్పించారు. ఒక్కపరుగున వెళ్లి నా ఆరాధ్యదేవత పాదాలపై పడదామని, వారి పాదాలమీదనే ప్రాణాలర్పించుదామనే ఆవేశం నాహృదయంలోంచి పదే పదే బయల్దేరుతూవుంది.

శాంతం,ఆత్మాభిమానం మూర్తీభవించిన మూర్తిగా కన్పడుతున్నారు. ఎంతటి అచంచలమైన తేజం! విచారం, దుఃఖం, శోకం వీటి ఛాయలుకూడ ఆముఖంలో కన్పడటంలేదు. అంతేకాదు, ఆపెదవులమీద స్ఫూర్తితోకూడిన మనోహరమైన చిరునవ్వు చిందులు త్రొక్కుతూవుంది. ఈమాత్రపు అపరాధానికి ఒక సంవత్సరం కఠినశిక్షా! ఆహా ఏమి న్యాయం! నేను ఇటువంటి అపరాధాలు ఎన్నైనా చేయగలను. నా ప్రాణప్రియుడు నావంకొకసారిచూచి చిరునవ్వు నవ్వారు; తక్షణమే ముఖభంగిమకఠోరం తాల్చింది.

కోర్టునుంచి ఇంటికివచ్చాను. రాగానే అయిదు రూపాయలుపెట్టి మిఠాయిలు తెప్పించాను. వలంటీర్లనందరిని పిలిచి పంచిపెట్టాను. సాయంత్రం మీటింగుకు వెళ్లాను. నేనదే మొదటిసారిగా కాంగ్రెసు మీటింగులో పాల్గొనటం. పాల్గొనటంతో సరిపోయిందా - వేదికెక్కి సత్యాగ్రహపు ప్రతిన పూనాను. నాకింతటి శక్తి, సామర్థ్యాలు ఎట్లా వచ్చాయో నాకే ఆశ్చర్యంవేసింది. సమస్తమూ కోల్పోయిన తర్వాత ఇక సంకోచానికి భయానికి తావెక్కడిది? ఆ సృష్టికర్త కల్పించే కఠినాతి కఠినమైన కష్టాలుకూడ ఇక నాకే మపకారం చెయ్యగలవు?

## ౨

మరునాడు రెండు టెలిగ్రాంలు ఒకటి మా నాన్నగారికి, రెండోది మామగారికి యిచ్చాను. మామగారు పెన్షను పుచ్చుకుంటున్నారు. తండ్రిగారు అటవీశాఖలో ఉన్నతోద్యోగం చేస్తున్నారు; కాని రోజంతా గడిచిపోయింది, టెలిగ్రాంకు జవాబురాలేదు. రెండోరోజయినా జవాబు రాలేదు. "ఈవృద్ధాప్యంలో మీరు నన్ను పోషించుతారనే ఆశపెట్టుకున్నాను. ఆశ నిరాశచేశారు. నేను భిక్షమెత్తుకుంటూవుంటే చూడాలని కోరికగా ఉందా నీకు? ప్రభుత్వం నాకు పెన్షను యిస్తూవుంది. ఈ పరిస్థితిలో నీకు ఆశ్రయమిచ్చి ఆవచ్చే పెన్షను వదలుకోలేను'' అని మామగారు వ్రాశారు.

మా తండ్రిగారి జవాబింత నిర్దయగాను, కఠోరంగాలేదు; అయినా భావంఅంతా దాదాపు ఇదే. ఈ సంవత్సరమే ఆయనకు ఉన్నతపదవి లభింపనున్నది. ఆయన నన్ను తన దగ్గరకు పిలిపించుకుంటే ఆపదవి బహుశా లభింపదేమో! కాని ఆయన వాక్సహాయం చేయుటకు సంసిద్ధుడయ్యాడు. ఆరెండు ఉత్తరాలు చించిపారేసి మళ్లీ వాళ్లకు ఉత్తరమయినా వ్రాయులేదు. అయ్యోస్వార్థమా! నీలీలయెంత యమోఘం. స్వయంగా తండ్రే, తన స్వార్థసిద్ధికి అవరోధం కల్గుతుందనే భీతితో, కుమార్తెనే

ఈరీతిగా నిర్దయ చూపటమా! స్వంత మామగారు తన కోడలిపై యింత ఉదాసీనత చూపటమా! అయినా నా వయస్సుమటుకు ఎంత? ఈప్రపంచంలో జీవితమంతా గడపాలిగదా!

ఇంతవరకు నేను నావిషయంలో నిర్భయంగా ఉన్నాను; కాని ఇప్పుడింకో క్రొత్తభయం ఏర్పడింది. నిరాధారంగాను, నిరాశ్రయంగాను, ఈ గృహంలో కాలంగడపడం ఎట్లానా అని విచారమూ, భయమూ. కాని ఎక్కడకు వెళ్ళడమా అన్నదే ప్రశ్న? పురుషుణ్ణయినా అయితే కాంగ్రెసు ఆశ్రయమయినా పొందేదాన్ని; లేకపోతే కూలీ నాలీనయినా చేసుకునేదాన్ని. "నారీత్వం" అనే సంకెళ్లు నాపాదాల రెంటినీ బంధించివైచినై. నారక్షణకంటే నా నారీత్వాన్ని రక్షించుకునే భారం, బాధ ఎక్కువైపోయింది. నాకు ప్రాణాలమీద ఆశ, చింత లేనేలేదు, కాని నా నారీత్వంవైపు ఇతరులను కన్నెత్తి చూడకుండా చూచుకోవాలి.

ఎవరోవచ్చిన అలికిడి వినిపించింది, క్రిందకొకసారి చూశాను. ఇద్దరు వ్యక్తులు నుంచొని ఉన్నారు. "మీరెవరు? ఎందుకిక్కడనుంచున్నారు?" అని అడుగుదామనిపించింది. ఈవిధంగా ప్రశ్నించే అధికారం నీకెక్కడదని నాఆత్మ అడ్డుపెట్టింది. వాళ్లు నుంచున్నది రాజబాట. వాళ్లకు యిష్టమున్నచోట నుంచుంటారు. వాళ్లను అడగటానికి నేనెవరిని?

కాని నామనస్సులో అనుమానం ఏర్పడింది. ఈఅనుమానం ఏవిధంగానూ మనస్సును వదిలిపెట్టడంలేదు. ఇదొకమూల హృదయంలో దాక్కొన్నది.

వేసవికాలం. ప్రాణం ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉంది ఉక్కకు. అయినా నేను గదితలుపులు మూసేఉంచాను. ఇంట్లో పెద్దచాకు ఒకటివుంది; దాన్నితీసి తలక్రింద పెట్టుకున్నాను. ఇంతరక్షణ చేర్పరచుకున్నప్పటికీ అనుమాన పిశాచం ఎదురుగా కూర్చొని నావంక గుడ్లురిమి చూస్తున్నదా అనిపిస్తున్నది.

బయటనుంచి ఎవరో కేకపెట్టారు. నాఒళ్లు ఝల్లుమన్నది. ఎవరా అని తెలుసుకుందామని తలుపు దగ్గరగా చేరి వింటున్నా. ఎవరో తలుపుతట్టుతున్నారు. గుండె దడదడకొట్టుకొంటోంది. బహుశా ఆ యిద్దరు దుండగులేమో! తలుపులెందుకు తట్టుతున్నారో! నాతో ఏంపని వీరికి? ఉన్నకొద్దీ నాకు కోపం ఎక్కువైంది. వెంటనే గదితలుపులు తెరవకుండా బాల్కనీలోనుంచొని బిగ్గరగా— "తలుపుతట్టేదెవరు?" అని ప్రశ్నించాను.

కేక వినేసరికి నా అనుమానం శాంతించింది. మనస్సు కొంత ఊరటపడింది. ధైర్యంవచ్చింది! వీరు జ్ఞానచంద్ బాబుగారు. నాభర్తకు మిత్రులు. వారి మిత్రులందరిలో వీరే చాల సత్పురుషులు. క్రిందకు వెళ్లి తలుపులుతెరిచాను. వారివెంట ఒక స్త్రీకూడా వుంది. ఆమె ఆయనభార్య అనుకుంటాను. ఆమె నాకంటె పెద్దది. మాయింటికి రావటం యిదే మొదటిసారి. నేనామెకు నమస్కారంచేశాను. పురుషులమైత్రి పురుషులవరకే సీమితమై ఉంటుంది. కాని వారి స్నేహం భార్యలవరకు చేరదు.

ఇద్దరూ మేడమీదకువచ్చారు. జ్ఞానబాబు కాలేజీ లెక్చరరు. గొప్ప విద్వాంసుడు, ఉదారవంతుడు, అమితనిష్కపటి; కాని ఆయనకు మార్గదర్శకురాలు ఈమేనని నాకు నేడే తెలిసింది. స్థూలకాయంగల మహిళ. ప్రతిభావంతురాలు. ముఖంలో ప్రస్ఫుటితమయ్యే తేజస్సు చూస్తే మహారాణిగారా యన్నట్లు కన్పడుతూఉంది. నఖశిఖ పర్యంతం ఆభూషణాలు అలంకరించుకుంది. ముఖమేమంత సుందరమైంది కాకపోయినా చూచేవాళ్ళను ఆకర్షిస్తూంది. బహుశా నేనామెను ఇంకెచ్చటనైనా చూచినట్లయితే ఆమె వంక చూచేదానిని కాదేమో, పెడముఖం పెట్టేదానినేమో! గర్వమే సజీవప్రతిమగా ప్రత్యక్షమైనట్లు ద్యోతకమైంది. ఆమె బయటకెంత కఠోరంగా కన్పడుతున్నదో, అంతర్యంలో దయార్ద్ర హృదయంకలది.

"ఇంటికి ఉత్తరంవ్రాశావా?" ఈప్రశ్న ఆమె సంకోచిస్తూవేసింది.

నేను - "ఆఁ, వ్రాశాను."

"ఎవరయినా తీసుకువెళ్లుటకు వస్తారా?"

"రారు. మాతండ్రిగారు, మామగారు ఇద్దరూ తమదగ్గర ఉంచుకోవడానికి అంగీకరించడంలేదు."

"అయితే ఇక?"

"ఇక నేమున్నది, ఇప్పటికి కిక్కడే పడిఉన్నాను."

"అయితే మాయింటికెందుకు రాకూడదు? ఏకాంతంగా నిన్ను ఈయింట్లో నిరాశ్రయంగా ఉండనివ్వను. సి. ఐ. డి వాళ్లు ఇద్దరు యింటి ముందు కాపలా కాస్తున్నారు."

"వాళ్లిద్దరు సి. ఐ. డి వాళ్ళని నేను మొదటనే అనుమానించాను."

జ్ఞానబాబు భార్యవంకచూచి, ఆమె అనుమతి పొందిన వానివలె - "అయితే నేను వెళ్ళి జట్కా తీసుకురానా?" అని అన్నాడు.

మీరు యింకా యిక్కడే ఉన్నారా? అన్నట్లు ఆయనవంక చూచింది.

లెక్చరరుగారు మౌనంగా బయటకు బయల్దేరారు.

"ఆగండి, ఎన్నిజట్కాలు తెస్తారు?" అని ఆమె ప్రశ్నించింది.

"ఎన్ని!" అని లెక్చరరుగారు కంగారుపడ్డారు.

"ఆఁ, ఎన్ని? ఒక్క జట్కాయేయయితే ముగ్గురు మనుష్యులకే సరిపోతుంది. పెట్టెలూ, పరుపులూ, సామాను అన్నీ నానెత్తిన పెడతారా?"

"రెండు జట్కాలు పిల్చుకొస్తాను" - లెక్చరరుగారు వణుకుతూ అన్నారు.

"ఒక్కజట్కాలో ఎన్నిసామాన్లు తీసుకువెళ్ళగలం."

"మూడు జట్కాలు తీసుకురానా?"

"అయ్యో, ఇంకా వెళ్ళనేలేదా. ఈస్వల్ప విషయానికే ఒకగంట తగలేశారు"

"జట్కాలువద్దూ, ఏమీవద్దూ" అని నేను చెప్పబోయేలోగానే జ్ఞానబాబు వెళ్ళిపోయారు.

నేను సంకోచిస్తూ - "సోదరీ, నేను మీ ఇంటికి వచ్చినందువల్ల చాలకష్టాలు కల్గుతై మీకు. ఇంకా..." అనబోయాను.

దేవిగారు తీక్షణ స్వరంతో - "అవును, కష్టం తప్పకకల్గుతుంది. నువ్వు రెండుపూటలూ పావుశేరు బియ్యం తింటావు; గదిలో ఒకమూల పడిఉంటావు; ఇది తక్కువకష్టమా మరి?" అని అన్నది హాస్యంగా.

నేను సిగ్గుపడుతూ - "మీరు నన్ను పరిహాసం చేస్తున్నారు" అని అన్నాను.

దేవిగారు నిష్కపట భావంతో నావీపు చరుస్తూ "నీభర్తగారు తిరిగివచ్చినతర్వాత నన్నుకూడ నీయింట్లో అతిథిగా అట్టిపెట్టుకో - నానష్టం తీరిపోతుంది. ఇక సంతోషమేనా? పద, పద జట్కాలు వచ్చేలోగా సామాన్లు సర్దు. మంచాలురేపు తెప్పించుకోవచ్చులే" అని తొందరచేసింది.

## 3

నేనింతవరకు, ఇట్టి సహృదయురాలు, ఔదార్య వంతురాలు, తేనెలొలికే మాటలు మాట్లాడే స్త్రీని చూడలేదు. నన్ను తన స్వంత చెల్లెలికంటె అనురాగంగా చూస్తూఉంది. కోపం, చింత ఆమెకు లేవనే చెప్పాలి. సదా ఆమెముఖంలో మధురానందం నృత్యం చేస్తూ ఉంటుంది. సంతానం లేకపోయినా వారిని నేను విచారపడుతూ ఉండటం చూడనేలేదు. బయటి పనులన్నీ చక్కబెట్టుటకు నౌకరును పెట్టుకున్నారు. ఇంట్లోపనులన్నీ తానే స్వయంగా చేసుకుంటుంది. మితంగా భోంచేస్తుంది, ఇంటెడుచాకరీ చేస్తుంది. విశ్రాంతి అన్నది ఆమెనొసటన లిఖించలేదేమో! అయినా ఆమె దృఢంగా ఎట్లాఉండగలిగిందో నేను గ్రహించలేకుండా ఉన్నాను. జ్యేష్ఠమాసపు మిట్టమధ్యాహ్నమప్పుడుకూడ పడుకునేదికాదు. నన్ను ఒక్కపని కూడ ముట్టుకోనివ్వదు. పైగా ఏదో ఒక ఫలహారం పెట్టి తినమని బ్రతిమాలి బలవంతపెడుతూనే ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉండటమే ఇక్కడున్న కష్టం.

వారం రోజులు గడిచినయ్యో లేదో ఒకరోజున ఆ సి. ఐ. డి వాళ్లిద్దరినీ క్రిందకూర్చొని ఉండగా చూచాను. నాకు అమిత అనుమానం కల్గింది. ఏదో కొంప మునుగుతుందనిపించింది. ఈదుష్టులు నన్ను వెంటాడుతూనే ఉన్నారు. నేను వెంటనే వెళ్లి ఆమెతో "ఆదుర్మార్గులిద్దరూ మన ఇంటి చుట్టూ తిరుగుతూనే ఉన్నారు." అని అన్నాను.

ఆమె హేయ భావంతో "కుక్కలు మోస్తరుగా తిరుగుతూ ఉంటారు, తిరిగితే తిరగనియ్యి" అంది.

నేను విచారంగా "ఏదయినా అవాంతరం తెచ్చిపెడితేనో" అన్నాను.

నిర్లక్ష్యంగా "ఈకుక్కలను మొరగటం కాక పోతే యింకేం చాతనవుతుంది" అన్నది.

నేను "కరవనూ కరుస్తాయి" అన్నాను.

పక్కున నవ్వుతూ "వీటికి భయపడి ఎవరూ పారిపోవడంలేదు" అన్నది.

నాకు మాత్రం అనుమానంగానేవుంది. పదే పదే బాల్కనీలోకివెళ్లి వాళ్లు క్రిందపచారు చేస్తూ ఉండటం చూచివస్తూనే ఉన్నాను. వీళ్లు ఈవిధంగా నావెంట పడ్డారెందుకు? ఇంతకీ ప్రభుత్వానికేమపకారం చేయగలను? నాకంతశక్తి ఏదీ? వీళ్లు నన్ను యిక్కడనుంచికూడ పారదోలటానికి ఎందుకు సిద్ధపడుతున్నారు? నేను ఊరూరు తిర్గుతూ ఉండాలనే గదా వీరి ఉద్దేశ్యం? ఛీ! ఎంతటి నీచులంటేను.

ఇంకోవారం గడిచింది. సి. ఐ. డీలు నన్ను విడిచి పెట్టలేదు. నావల్ల వీరికేమి కీడు కలుగ నున్నదో అని నాకు ప్రాణాలు విసికెత్తి పోతున్నై. ఈపరిస్థితిలో యిచ్చట వీరింటిలో యిక ఉండటం న్యాయం కాదనుకున్నాను, కాని ఆమెతో నావల్ల మీరు అపవాదుల పాలు కావలసి వస్తుందన్న సంగతి చెప్పలేకున్నాను.

ఒకరోజు సాయంత్రం జ్ఞానబాబు ఇంటికివచ్చారు. చాల గాబరాగా ఉన్నారు. నేను వరండాలో కూర్చొని కూరలు తరుగుతున్నాను. జ్ఞానబాబు సరాసరి గదిలోకివెళ్లి భార్యను సంజ్ఞచేసి పిలిచారు.

ఆమె అక్కడే కూర్చొని "మొట్టమొదట దుస్తులు మార్చండి, కాళ్లు, చేతులు కడుక్కొని ఫలహారంచేసి, ఆపిమ్మట చెప్పదలచిందేమో సావకాశంగా చెప్పండి" అని అన్నది.

జ్ఞానబాబుకు అంతధైర్యం, ఓర్పు ఎక్కడివి? ఆయన మనస్సులో మాటదాగదు. ఎప్పుడు వెళ్లగక్కుదామా అన్నంత ఆతురత. కొంచెం విసుక్కుంటూ, "నీవులేచి రానన్నా రాలేవు. నానెత్తి మీదకు వచ్చింది" అంటూ పిలిచారు.

"చెప్పేదేమో చెప్పకూడదూ" అని ఆమె అక్కడ కూర్చొనే అన్నది.

"ఇక్కడికి రాబ్బా."

"ఇతర్లుఇంకెవరయినాఇక్కడ కూర్చొన్నారా?"

నేనక్కడనుంచి తప్పుకో బోయాను. ఆమె నాచెయ్యి గట్టిగా పట్టుకున్నది. ఆపట్టును విడిపించుకో లేకపోయాను. జ్ఞానబాబు నాసమక్షంలో చెప్పదలచడంలేదు, కాని కొంతసేపు ఆగుదామన్న ఓర్పుకూడాలేదు. కోపంతో "ప్రిన్సిపాలు, నేను పోట్లాడుకున్నాం" అన్నారు.

ఆమె కృత్రిమ గాంభీర్యంతో "నిజమే! మీరు ఆయన్ని బాగా కొట్టారుగదూ?" అన్నది.

"నీకేమో హాస్యంగా ఉంది. వాళ్లు నా ఉద్యోగానికి స్వస్తి వాచకం చదువుతున్నారు."

"ఆభయం ఉన్నప్పుడు ఎందుకు పోట్లాడాలి?"

"నేను పోట్లాడితేగా, ఆయనే పిల్చి మందలించాడు."

"అనవసరంగానే?"

"ఇప్పుడునీతో ఏమని చెప్పుకోను, ఈగోడు"

"మళ్లీ ఆదాపరికమేనా, ఈమె నాచెల్లెలని మీతో చెప్పనే చెప్పాను. ఈమెముందు దాపరికం ఉండకూడదని నా అభిలాష."

"ఈమెకు సంబంధించిన విషయమే అయితేనో?"

ఆమె అసలు సమస్యను అర్థం చేసుకున్న దానివలె "సరే, అర్థమయిందిలెండి. సి. ఐ. డీల తగాదా అయివుంటుంది. పోలీసులు మీప్రిన్సిపాలు గారికి ఫిర్యాదుచేసి ఉండాలి" అన్నది.

జ్ఞానబాబు ఇంత సులువుగా తన సమస్య పరిష్కరింపబడటానికి అంగీకరించలేదు. "పోలీసులు ప్రిన్సిపాలుకు ఫిర్యాదు చేయలేదు. జిల్లాకలెక్టరు గారికి ఫిర్యాదు చేశారు. ఆయన ప్రిన్సిపాలును పిలిచి నాదగ్గర స్టేటుమెంటు పుచ్చుకోమని ఆజ్ఞాపించారు" అని చెప్పారు.

ఆమె దివ్యదృష్టితో విషయాన్నంతా అవగాహన చేసుకున్న దానివలె "సరే, ప్రిన్సిపాలు ఆస్త్రీని ఇంట్లోనుంచి వెళ్లగొట్టమన్నాడుకదూ" అన్నది.


"అవును, ఇంతేననుకో."

"మీరేమని జవాబిచ్చారు."

"ఇంకా ఏమీచెప్పలేదు. అక్కడ నుంచున్న పాళంగా ఏం జవాబిస్తాను?"

ఆమె "చెప్పవలసిన జవాబు ఒక్కటే అయినప్పుడు ఇంకా ఆలోచించడం దేనికి" అని ఆయన సిగ్గుతెచ్చుకునేటట్లు అన్నది.

జ్ఞానబాబు సంకోచిస్తూ-"అయినా ఆలోచించడం అవుసరం" అన్నారు.



ఆమె ఉగ్రరూపం తాల్చింది. నేనామెకు కోపం రావడం ఇదే ప్రథమంగా చూచాను. ఆ ఆవేశంతోటే ఆమె - "మీరిప్పుడేవెళ్ళి ప్రిన్సుపాలుతో నేనామెను ఏపరిస్థితిలోనూ ఇంట్లోనుంచి వెళ్ళగొట్టనని చెప్పండి. ఒప్పుకోకపోతే పావుటావు పేపరు యిచ్చివేసి చక్కా తిరిగిరాండి. మళ్లీ వచ్చిన తర్వాత ఫలహారం చేద్దురుగాని" అని అన్నది.

నేను దుఃఖంతో విలపిస్తూ - "అక్కా, నా కోసం-" అన్నాను.

ఆమె నన్ను కోప్పడుతూ - "నువ్వు ఊరుకో, వినకపోయావా చెవిమెలవేస్తా, మధ్యలో మాట్లాడుతా వెందుకు? ఉంటామా అందరమూ కలిసి ఉంటాం, లేకపోతుందీ అందరమూకలిసే చస్తాం. ఈ మనిషిని ఏమనాలో, తెలియకుండా ఉంది! సగం వయస్సు మళ్ళింది, మాట్లాడటం చేతనే కాదు. (భర్త నుద్దేశించి) నంచోని ఏమాలోచిస్తున్నారు? మీకు భయంగా ఉంటే నేను వెళ్ళి చెప్పి రానా!" అన్నది.

జ్ఞానబాబు కోపంతో - "రేపువెళ్లి చెప్పేస్తాలే, ఇప్పుడు ఎక్కడ ఉంటాడో ఎవడికేం తెలుస్తుంది" అని అన్నాడు.

రాత్రి అంతా నిద్రపట్టలేదు. నా ముఖము చూడకూడదని నాతండ్రి, నామామ అన్నారు. తమ ఇండ్లకే చేరనివ్వలేదు. కోడ్లవెంట దిచ్చమెత్తుకోవలసిన దానిని నన్ను నెత్తిన బెట్టుకొని ఆదరిస్తున్నారే! నావల్లకల్గేకష్ట,నష్టాలనుకూడ ఎదుర్కొంటున్నారే! నిజంగా దేవతామూర్తులనే అనాలి వీరిని.

మర్నాడు జ్ఞానబాబు వెళ్లేటప్పుడు - "వాడో వీడో తేల్చేసుకురండి. మళ్లీ ఆలోచించాల్సిన అవుసరం రానివ్వకండి" అని హెచ్చరించి చెప్పింది.

జ్ఞానబాబు వెళ్లిన తర్వాత నేను-"అక్కా, నీవు నాకు చాల అన్యాయం చేస్తున్నావు. నావల్ల మీరు కష్టాలనుభవించడం నేను చూడలేను" అని అన్నాను.

ఆమె చిరునవ్వు నవ్వుతూ - "ఇంతేనా ఇంకే మయినా చెప్పాలనుకున్నావా" అని అడిగింది.

"చెప్పేశాను; కాని ఇంకా ఎంతో చెప్పవల సింది ఉంది."

"సరే మంచిదే; నీభర్త కారాగారాని కెందుకు వెళ్లాడు? వలంటీర్లను గౌరవించి ఫలహారాలు పెట్టి నందుకేగా! వలంటీర్లు ఎవరు? మనజాతీయ సమర సైనికులు. వాళ్లకు పిల్లలుంటారు, తల్లిదండ్రు లుంటారు, వారూ ఏదో వ్యాపారం చేసుకుంటూ ఉంటారు. వాళ్లు దేశపోరాటం, జాతిపోరాటంలో తమ సర్వస్వాన్ని అర్పించారు. వీరపురుషులను సత్కరించినందుకుగాను జయిలుకు వెళ్లాడు నీభర్త. ఆసత్పురుషుని యిల్లాలవగు నిన్ను సత్కరించి సందర్భిం చిన మాత్రానే ఆత్మపవిత్రమవుతుంది. నీకు నేనేమీ ఉపకారంచేయలేదు. పైపెచ్చు మాఇంట్లో ఉండుట కంగీకరించి, మేము తరించటానికి సాధన భూతురా లవై నీవే మాకుపకారం చేస్తున్నావు" అన్నది.

ఆమె నాపై చూపుతున్న కరుణాసాగరంలో మున్కలు వేస్తున్నాను. నానోటివెంట మాట పెకలటంలేదు. ఏంచెప్పాలో తెలియటంలేదు.

సాయంత్రం జ్ఞానబాబు ఇంటికి వచ్చారు. ఆయన ముఖం యుద్ధంలో విజయం సాధించిన సారధివలె ఆనందంతో అలరారుతున్నది.

ఆమె - "జయమా, అపజయమా" అన్నది.

జ్ఞానబాబు సగర్వంగా- "విజయమే! నేను రాజీ నామా పత్రం దాఖలు చేశాను. దాంతో ప్రిన్సి పాలు ఆశ్చర్యపోయాడు. వెంటనే జిల్లా కలెక్టరు దగ్గరకు వెళ్లాడు. అక్కడ వాళ్లిద్దరూ ఏంసంప్ర దించుకున్నారో ఏమో? కాని ప్రిన్సిపాలు తిరిగి వచ్చి - మీరు రాజకీయాలలో పాల్గొనటంలేదు కదా?" అని అడిగారు.

నేను "లేదు."

"కాంగ్రెసు మెంబరువు కాదుగదా?"

"కాదు."

"కాంగ్రెసు ఫండుకు చందా యిస్తున్నారా?"

"లేదు."

"అట్లయిన మిమ్మల్ని అనవలసినపనిలేదు. నేను మీరాజీనామా పత్రం వాపసు చేస్తున్నాను."

ఆమె అమితానందంతో నన్నొకసారిగా కౌగి లించుకున్నది.


పాతురిడుగారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

## డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

11, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణము బ్రాంచి : | తిరుచినాపల్లి బ్రాంచి : |
| --- | --- |
| 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి. | 15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O. |

అన్ని మందుల షాపులలోను దొరకును.